

- మూడు జిల్లాలు, ఏజెన్సీ రాకపోకలకూ అనుకూలం
- ప్రజాప్రతినిధులకూ సౌలభ్యం
- పిల్లలకు దగ్గరలోనే ఐటీ ఉద్యోగాలు
- వైసీపీ హయాంలో ధ్వంసం
- కూటమి రాకతో పునరుజ్జీవం
- నూతనోత్తేజంతో రాజధాని పనులు పునః నిర్మాణం
- ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి భారీగా తరలివెళ్లిన జనం

గోదావరి టు అమరావతి!

ప్రధానితో..



అమరావతి సభకు వస్తున్న మోదీకి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు





(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విజన్ ఉన్న నాయకుడి అభివృద్ధి.. విధ్వంస నాయకుడి ధ్వంసం మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలు గత ఐదేళ్లలో ప్రత్యక్షంగా అనుభవించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రజలకు రాజధాని లేకుండాపోయింది. సంక్షోభాల నుంచే అవకాశాలను సృష్టించుకోవాలని పదేపదే చెప్పడమే కాకుండా ఆచరణలో కూడా చేసి చూపించే సీఎం చంద్రబాబు.. రాజధానిని చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్మించాలని సంకల్పించారు. అన్ని పార్టీల అంగీకారంతో గుంటూరు- విజయవాడ ప్రాంతంలో నిర్మించాలనుకున్న రాజధానికి 'అమరావతి' అని నామకరణం చేశారు. 2017 మార్చి 2న శాసనసభను ప్రారంభించడంతో పాలన కూడా మొదలైంది. తర్వాత 2019లో ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా టీడీపీ అధికారం కొనసాగేవిధంగా ప్రజలు దీవించి ఉంటే ఈనాటికి అద్భుతమైన రాజధాని అమరావతి ఆవిష్కృతమయ్యేది. కానీ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం.. ప్రజలు జగన్‌కి పట్టంగట్టడంతో రాజకీయ కక్షను రాష్ట్ర ప్రయోజనాలకు ముడిపెట్టి అమరావతిని ధ్వంసం చేశారు. అప్పటివరకూ జరిగిన అమరావతి నిర్మాణాలను నిర్వీర్యం చేశారు. మూడు రాజధానులంటూ ఐదేళ్లు మూడు ముక్కలాటగా నడిచింది. అయితే 2024లో మళ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో ఏర్పడిన కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం పగ్గాలు చేపట్టడంతో అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ప్రధాని మోదీతో రాజధాని పనులకు శుక్రవారం పునఃప్రారంభం చేయించారు. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి వాసులకు అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అమరావతి రాజధానికి వెళ్లాలంటే సగానికి సగం వ్యయ ప్రయాసలు తగ్గినట్టే.

● అందిపుచ్చుకున్నట్టేగా..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలతోపాటు రంపచోడవరం ఏజెన్సీవాసులకు కూడా అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. వివిధ పనులపై రాజధానికి వెళ్లడానికి ప్రజలకు ఇబ్బంది తప్పుతుంది. హైదరాబాద్‌తో పోలిస్తే అమరావతి ఉమ్మడి తూర్పు వాళ్లకు దగ్గరే కాకుండా రవాణా సదుపాయమూ సౌలభ్యంగా ఉంటుంది. రైలు, బస్సుల్లో మూడు గంటల్లో, విమానంలో 45 నిమిషాల్లో అమరావతికి చేరుకోవచ్చు. కోర్టు, వైద్య పనులపై వెళ్లేవారికి ఇంకా సదుపాయంగా ఉంటుంది. రాత్రి వేళల్లో బస చేసే అవసరం ఉండదు. ఉదయం బయలుదేరితే పనులు చక్కబెట్టుకొని రాత్రి వేళకు ఇంటికి చేరుకోవచ్చు. గోదారోళ్ల రైలు ప్రయాణాలకు రాజమండ్రిని గేట్‌వేలాంటిది. ఈ రైల్వే స్టేషను గుండా విజయవాడ వెళ్లడానికి రోజూ 50కిపైగా రైళ్లు నడుస్తుంటాయి. అరగంటకో బస్సు అందుబాటులో ఉంటుంది. కాకినాడ జిల్లా వాళ్లకూ విజయవాడకు రవాణా సదుపాయాలు బాగానే ఉన్నాయి. కోనసీమ జిల్లావాసులకు రావులపాలెం నుంచి కూడా ప్రయాణ సదుపాయం మరింతగా కలుస్తుంది. అమలాపురం నుంచి మచిలీపట్నం హైవే గుండా కూడా విజయవాడకు సుమారు నాలుగు గంటల్లోపే చేరుకోవచ్చు.

● వైసీపీ హయాంలో ధ్వంస రచన

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అమరావతికి ధ్వంసరచన మొదలైంది. తాత్కాలిక హైకోర్టు మినహా పరిపాలన వంటి తాత్కాలిక భవనాలు తుది దశలో ఉండగా, రహదారులు వేగంగా నిర్మాణం జరుగుతూ.. ఐటీ కంపెనీలు కుదురుకునే దశలో సీఎంగా పగ్గాలు చేపట్టిన జగన్ అమరావతిని నట్టేట ముంచేశారు. జీఎన్‌ఆర్ కమిటీ సిఫారసులంటూ రాజధాని వికేంద్రీకరణను తెరపైకి తీసుకొచ్చారు. ఐదేళ్లపాటు మూడు ముక్కలాటను రాష్ట్ర ప్రజలకు చూపించారు. మూడు రాజధానులు కార్యరూపం దాలిస్తే ఉమ్మడి తూర్పు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారే. ఉదాహరణకు రాజమండ్రి నుంచి కర్నూలు 500 కిలోమీటర్లు, విశాఖపట్నం 200 కిలోమీటర్లు, విజయవాడ 200కిలోమీటర్ల దూరంలో త్రికోణాకారంలో ఉన్నాయి. విజయవాడకు ఉన్న సదుపాయాలు వేటికీ లేవు. దీంతో అష్టకష్టాలు పడాల్సి వచ్చేది.



అమరావతిలో ప్రధాని సభా ప్రాంగణంలో ఎంపీ హరీష్‌మాధుర్ , ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

● పిల్లలకు దగ్గరలోనే ఉద్యోగాలు

ఓ పదేళ్ల నుంచీ సాఫ్ట్‌వేర్ చదువులపైనే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. కానీ తగిన అవకాశాలు మాత్రం దగ్గరలో లేవు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ కొలువులు కూడా దూరమయ్యాయి. మన దగ్గర చెప్పుకోదగిన కంపెనీలు లేవు. దీంతో 2019కి ముందు టీడీపీ అధికారంలో ఉండగా మొదలుపెట్టిన అమరావతి రాజధానిలో ఐటీ కంపెనీలకూ పెద్దపీట వేశారు. మైక్రోసాఫ్ట్, విప్రో, టీసీఎస్ వంటి పెద్ద సంస్థల ఏర్పాటుకు చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని అటు విశాఖ, ఇటు అమరావతిలోను భారీ రాయితీలిచ్చారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిలోని నిర్మాణంలో ఉన్న ఐటీ కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి పారిపోయాయి. దీంతో ఐటీ కొలువుల కోసం యువత బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లకే వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బెంగ తీరనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో మళ్లీ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చేవిధంగా సీఎం చంద్రబాబు ఇప్పటికే కసరత్తు చేశారు. దీంతో అంతర్జాతీయ కంపెనీలతోపాటు మధ్య, చిన్నతరహా ఐటీ కంపెనీలు పెద్దఎత్తున రానున్న కాలంలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. మన ఐటీ పిల్లలకు స్వల్ప దూరంలోనే ఉద్యోగ అవకాశాలూ లభించనున్నాయి.

● ప్రజాప్రతినిధులకూ అందుబాటులో..

ఉమ్మడి తూర్పుగోదావరిలో 23 నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో హైదరాబాద్ రాజధానిగా ఉండే సమయంలో ఒక్కరోజు పనిపై అక్కడికి వెళ్లాల్సి వచ్చినా ప్రయాణకాలంతో కలిపి రెండు రోజుల సమయం పట్టేది. నియోజకవర్గంలో అకస్మాత్తుగా ఏదైనా ఘటన జరిగినా హాజరు కావడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. హైదరాబాద్ నుంచి ఈ ప్రాంతానికి రావాలంటే కారులో సుమారు పది గంటలు పడుతుంది. రైలులో అయితే రాత్రి రైలెక్కితే ఉదయం హైదరాబాద్ చేరుకుంటారు. ఇప్పుడు ఉమ్మడి తూర్పునకు రాష్ట్ర రాజధాని 500 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల చేరువకు వచ్చేసింది. దీంతో ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు సైతం ముందు రోజు కాకుండా అదేరోజున ఉదయం బయలుదేరి వెళ్లి సాయంత్రానికి మళ్లీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే వెసులుబాటు కలిగింది. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సంబంధించి సీఎం కార్యాలయం, రాష్ట్ర సచివాలయం, రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రుల కార్యాలయాల్లో పనులున్నా ఇలా బయలుదేరివెళ్లి.. అలా రాత్రికి వచ్చేయవచ్చు. దీంతో శ్రమ తగ్గడంతోపాటు ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండే సమయం గణనీయంగా అదా అవుతోంది. అదే జగన్ చెప్పినట్లు మూడు రాజధానులైతే.. ఒక ఎమ్మెల్యే ఇక్కడి నుంచి బయలుదేరి అసెంబ్లీ సమావేశాలకు విజయవాడ వెళ్లి, అక్కడి నుంచి అధికారులతో పనులకు విశాఖ చేరుకొని, కోర్టు పనులుంటే కర్నూలు వెళ్లి రావాలంటే ఎంత కష్టం.

అమరావతి సభకు భారీగా తరలివెళ్లిన కూటమి శ్రేణులు

కాకినాడ, మే 2, (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునఃనిర్మాణ వేడుకను వీక్షించేందుకు కాకినాడ జిల్లా నుంచి పెద్దఎత్తున జనం తరలివెళ్లారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు ప్రముఖుల సమక్షంలో జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, సామాన్యులు శుక్రవారం వెళ్లారు. కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధికారులకు సమన్వయ బాధ్యతలు అప్పగించి రాకపోకలు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేశారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు గురువారం రాత్రికే అమరావతి చేరుకోగా శుక్రవారంఉదయం జిల్లానుంచి వేలాది జనం బయల్దేరారు. జిల్లానుంచి నియోజకవర్గానికి పది చొప్పున మొత్తం 70బస్సులు ఏర్పాటు చేసి 3వేల మంది వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రైవేటు వాహనాల్లో పార్టీ శ్రేణులను వెంట తీసుకువెళ్లారు. కాకినాడ నగరంనుంచి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కాకినాడ నుంచి టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున అమరావతి తరలివెళ్లారు. కాకినాడ సినిమారోడ్డులోని మున్సిపల్ కార్యాలయంవద్దనుంచి ఆరు బస్సుల్లో జనం వెళ్లారు. ఈ బస్సులను ఎమ్మెల్యే కొండబాబు తనయుడు మోహన్ వర్మ జెండా ఊపి ప్రారంభించారు. జగ్గంపేట నియోజకవర్గంలో టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అమరావతి సభకు తరలి వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.



కాకినాడనుంచి అమరావతి సభకు బయలుదేరుతున్న నేతలు

స్థాయీ సంఘాలు సూచించిన అంశాలపై చర్యలు చేపట్టాలి

- జడ్పీ చైర్మన్ విప్పర్తి

7

రేపు 'నీట్' పరీక్ష

- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5వరకు నిర్వహణ
- కాకినాడలో 10పరీక్ష కేంద్రాలు

కలెక్టరేట్(కాకినాడ), మే2(ఆంధ్రజ్యోతి): ఈనెల 4న కాకినాడలో పది పరీక్ష కేంద్రాల్లో నీట్ పరీక్ష జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 11గంటలనుంచి మధ్యాహ్నం 1.30గంటలలోపు పరీక్ష కేంద్రాల్లోకి హాజరుకావాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఏ స్టేషనరీ ఐటెమ్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, పెన్నులు, పెన్సిళ్లు, వాచ్‌లు, ఆభరణాలు,వాలెట్, గాగుల్స్, హ్యాండ్ బ్యాగ్స్, బెల్ట్, క్యాప్, బ్రాస్లెట్స్‌తో తదితర పరికరాలు అనుమతించబడవన్నారు. పీఎస్‌ఎంసీ గర్ల్స్ హైస్కూల్ కాకినాడ, ఎంజీఎంసీహెచ్ఎస్ గాంధీనగర్, పీఆర్ ప్రభుత్వ కళాశాల కాకినాడ, ఈసీఈ డిపార్ట్‌మెంట్ జేఎన్‌టీయూ కాకినాడ, సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ జేఎన్‌టీయూ, పీఆర్ ప్రభుత్వ హైస్కూల్ కాకినాడ, మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కాకినాడ, ఎస్‌ఎస్‌ఆర్‌కే మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కాకినాడ, ఆర్‌జీఎంసీహెచ్ స్కూల్ ఆనందభారతి, ఎంపీఎల్ హైస్కూల్ చర్చ్ స్క్వేర్ కాకినాడలో పరీక్షలు జరుగుతాయన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 98 గ్రాముల బంగారం అపహరణ
- అన్నవరంలో ఘటన

అన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): అన్నవరం గ్రామశివారు కొత్తపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు 98 గ్రాముల బంగారం అపహరించుకుపోయినట్లు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన వేగేశ్న విజయ అన్నవరం శివారు కొత్తపేటలో నూతనంగా ఇంటి నిర్మించుకుని నివాసంఉంటున్నారు. గతనెల 29న ఆమె ఇంటికి తాళాలు వేసి విశాఖపట్నం వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి పనివారు వెళ్లి చూడగా తాళాలు పగలుకొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే విజయకు సమాచారం అందించారు. దీంతో ఆమె అన్నవరం చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనాస్థలాన్ని ఎస్ఐ హరిబాబు సిబ్బందితో పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కాకినాడ రూరల్‌లో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం

- ఏపీకి చెందిన 26 పురుషుల, మహిళా జట్లు హాజరు
- హోరాహోరీగా తలపడిన జిల్లా జట్ల క్రీడాకారులు

7



పోటీల్లో తలపడుతున్న శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల మహిళా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో భాగంగా క్రీడాకారులనుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు

అభ్యంతరం లేకుంటే.. ఆమోదం

- అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు జిల్లాలో 366 దరఖాస్తులు
- 150 గజాలలోపు దరఖాస్తుదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్
- మిగిలిన వాటికి రుసుం చెల్లించాలి
- వీఆర్వోనుంచి ఆర్డీవో వరకు దరఖాస్తుల పరిశీలన
- తుదిగా డివిజన్‌స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పబ్లికేషన్
- అభ్యంతరాలు స్వీకరించిన తర్వాతే ఆమోదం
- దరఖాస్తుల పరిశీలనకు 60నుంచి 90 రోజుల సమయం

కలెక్టరేట్(కాకినాడ), మే 2(ఆంధ్రజ్యోతి): అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 366 దరఖాస్తులు వచ్చాయి. దీనిలో 150 చదరపు గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి దరఖాస్తుదారులకు పట్టాలు ఇస్తారు. 151 నుంచి 300 గజాల వరకు రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి మాత్రమే ఇది వరిస్తుంది. 300 గజాల నుంచి 450గజాల పరిధిలో వారు వందశాతం బేసిక్ ధర, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. జిల్లాలో వచ్చిన మొత్తం 366 దరఖాస్తుల్లో వివిధ కేటగిరీలను అధికారులు విడదీసి పరిశీలిస్తున్నారు. తొలుత దరఖాస్తు గ్రామస్థాయిలో వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. వీఆర్వో ఆయా భూములను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను ఆర్ఐ లాగిన్‌కు పంపుతారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీవో లాగిన్‌కు వెళ్తుంది. నిబంధనల ప్రకారం వీరు పరిశీలించిన తర్వాత తుదిగా రెవెన్యూ విభాగంలో డివిజన్ లెవెల్ కమిటీ ఈ దరఖాస్తులను స్క్రూట్నీ చేస్తుంది. దరఖాస్తు చేసుకున్న భూములు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. కాలువ గట్లు, నీటిపారుదలశాఖ చెందిన గట్లు, లేఅవుట్ స్థలాల్లో, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో ఆక్రమణలకు క్రమబద్ధీకరణ చేయలేరు. ఈ నేపథ్యంలో ఆయా దరఖాస్తు దారులు ఏఏ ప్రాంతాల్లో ఆక్రమణ చేసుకుని ఉన్నారో పరిశీలించిన తర్వాత ఆయా స్థలాల క్రమబద్ధీకరణ క్రతువు జరుగుతుంది. ఒకరి దరఖాస్తును పరిశీలించి ఆమోదించడానికి 60 రోజుల నుంచి 90 రోజుల సమయం పడుతుంది. తుదిగా డివిజన్ స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పబ్లికేషన్ చేసిన తర్వాత అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలు లేకపోతే వాటికి రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందజేస్తారు.

366 దరఖాస్తులు వివిధ దశల్లో..

జిల్లాలో 366 దరఖాస్తులు రాగా అవి వివిధ దశల్లో ఉన్నాయి. దీనిలో ఒక్క దరఖాస్తును ఆమోదించారు. ఏడు దరఖాస్తులను తిరస్కరించారు. 8 దరఖాస్తులను వీఆర్వోలు, 8 దరఖాస్తులను ఆర్ఐలు, 58 దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలిస్తున్నారు. 247 దరఖాస్తులను ఆర్డీవోలు పరిశీలిస్తున్నారు. ఈ దరఖాస్తుల్లో కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో 186 దరఖాస్తులు, పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లో 180 దరఖాస్తులు ఉన్నాయి.



అన్నవరంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

సత్యదేవుడి సన్నిధిలో కలెక్టర్ పూజలు

అన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. స్వామి దివ్యకల్యాణోత్సవాలు సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దీనికి సంబంధించి తననుంచి ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా వెంటనే తెలియపరచాలన్నారు. సింహాచలం ఘటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సర్పంచ్ కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

రేపు భగీరథ జయంతి

కలెక్టరేట్(కాకినాడ), మే2(ఆంధ్రజ్యోతి): ఈనెల 4న భగీరథ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడకలెక్టరేట్ వివేకానందహాలులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహిస్తారన్నారు.

యాప్ 'లోను'.. చెల్లించేలా..



- సులభతరంగా రుణ వాయిదాల చెల్లింపునకు కొత్త యాప్
- స్వయం సహాయక సంఘాలకు త్వరలో అందుబాటులోకి..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. రుణాలు ఇవ్వడమే కాదు.. ఆ రుణాల చెల్లింపును కూడా సులభతరం చేస్తోంది. బ్యాంకుల వద్ద పడిగాపులు పడే ఇబ్బందిలేకుండా చేయనుంది. త్వరలోనే రుణ వాయిదాల చెల్లింపునకు కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

జిల్లాలో స్వయంసహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రూ.153.31కోట్ల లక్ష్యం కాగా రూ.150.88 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. ఆయా గ్రూపుల పరిధిలో స్వయం సహాయక సంఘాల అవసరాలను బట్టి ఒక్కో సభ్యురాలికి ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంట్ చార్జీలు, ఇతర ఫీజులు లేకుండా రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలిస్తున్నారు. రూ.50వేల రుణం తీసుకుంటే 24వాయిదాల్లో, అంతకుమించితే 36వాయిదాల్లో తిరిగి బ్యాంకులకు చెల్లించాలి. ప్రస్తుతం సంఘాల సభ్యులు రుణాల చెల్లింపులను వేటీఎం ద్వారా చేస్తున్నారు. రుణ వాయిదాల చెల్లింపు సమయంలో అవకతవకలు, మోసాలు, చేతివాటాలవల్ల రూ.లక్షల్లో నగదు పక్కదారి పట్టేది. అసలు చెల్లించారో! లేదో! తెలిసేది కాదు. ప్రస్తుతం రుణాలు పొందిన మహిళలు ఎవరికి వారే వాయిదాలు చెల్లించేలా త్వరలో పేమెంట్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. దీనిద్వారా నేరుగా యాప్‌లో చెల్లింపులు చేయొచ్చు. పారదర్శకతతోపాటు చెల్లింపుల్లో అవకతవకలకు చోటుండదు. నెలవారీ వాయిదాలను ఆన్‌లైన్‌లో నగదురహితంగా ఇంటి నుంచే చెల్లించొచ్చు.

పారదర్శకత పెరుగుతుంది

చెల్లింపు చేసిన వెంటనే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. వాయిదా సొమ్మును స్వాహా చేసే ఆస్కారం ఉండదు. లావాదేవీలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని యాప్‌లో చూసుకోవచ్చు. యాప్ అందుబాటులోకి వస్తే పారదర్శకత పెరుగుతుంది.

- ప్రియంవద, మెప్మా పీడీ

సీరియల్ కిల్లర్‌కు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స

- భయాందోళనకు గురైన రోగులు, ఆస్పత్రి సిబ్బంది

జీజీహెచ్(కాకినాడ),మే2(ఆంధ్రజ్యోతి): అతనొక సీరియల్ కిల్లర్. యువతులపై అత్యాచారం, హత్యలకు పాల్పడేవాడు. ఈ కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న తమిళనాడుకు చెందిన ఈ కిల్లర్ కంటి సంబంధిత అనారోగ్యానికి గురవడంతో కాకినాడ జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్సచేశారు. అతడిని ఎస్కార్ట్ సిబ్బందితో ఆస్పత్రిలో రోగులు చూసే సరికి తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

యానాం జైలునుంచి..

తమిళనాడు రాష్ట్రానికి చెందిన 45ఏళ్ల నిత్యానందన్ 2020 సంవత్సరంలో 10 అత్యాచారాలు, 7 హత్యలకు పాల్పడ్డాడు. అత్యాచారం చేసిన యువతులను కిరాతకంగా చంపేవాడు. ఈ క్రమంలో అక్కడి పోలీసులకు చిక్కాడు. అనంతరం పాండిచ్చేరి కోర్టు అతడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. నిత్యానందన్‌పై జైల్లోనే పలుమార్లు హత్యాయత్నం జరిగింది. దీంతో అతడ్ని యానాం సబ్‌జైలుకు తరలించారు. అతడు కంటికి సంబంధించిన సమస్యతో బాధపడుతుండడంతో ఎస్కార్టు సిబ్బంది పటిష్ట బందోబస్తు మధ్య శుక్రవారం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం అతడ్ని ఈఎన్‌టీ విభాగంలోని ప్రత్యేక వార్డులో ఉంచారు. తదుపరి కంటి ఆపరేషన్ థియేటర్‌కు తరలించి డాక్టర్లు శస్త్రచికిత్స నిర్వహించారు.





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



భీమ కవి పాల రాతి విగ్రహం



నూతనంగా నిర్మించిన భీమ కవి ఆలయం

వేములవాడలో భీమ కవి ఆలయం

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

భీమ కవి విగ్రహాన్ని ఊరేగించిన గ్రామస్తులు

కరప, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడలో వేములవాడ భీమ కవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వరపుత్రుడిగా ప్రాశస్త్యం పొందిన భీమ కవికి గ్రామస్తులు రూ.50 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. అందులో పాల రాతి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం భీమ కవి విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఉంచి పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వేములవాడ, వలసపాకల గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజ్యం విశ్వనాథ శివాచార్య ఆధ్వర్యంలో భైరవభొట్ల మాచిరి బ్రహ్మాజీ శర్మ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని,



వేములవాడ భీమకవి జన్మస్థలంగా పేర్కొంటూ ఏర్పాటుచేసిన ముఖద్వారం

అనంతరం భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు వివరించారు. ఊరేగింపులో కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, మీసాల రాంబాబు, బండే తాతాజీ, పాలిక వీ రాజు, సూరిబాబు, అప్పనపల్లి శ్రీవెంకటనారయ్య, పెద్ద, వజ్రపు కామేశ్వరరావు, పుణ్యమంతుల అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భీమ కవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న వేములవాడ గ్రామస్తులు



భారత్-వియత్నాం మధ్య బలమైన సాంస్కృతిక బంధం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): భారత్-వియత్నాం నడుమ ఆధ్యాత్మిక సామరస్యం, బలమైన సాంస్కృతిక బంధాన్ని పెంపొందించే విధంగా వియత్నాం బౌద్ధ విశ్వవిద్యాలయంలో బుద్ధ భగవానుని అవశేషాల ప్రతిష్ఠ వైభవంగా జరిగిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి న్యూఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద



దేశంలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరిచిన బుద్ధుడి పవిత్ర అస్థికలు, అవశేషాల పేటికకు నమస్కరించి ఐఏఎఫ్‌కు చెందిన హెర్క్యులస్ అనే ప్రత్యేక విమానంలో పవిత్ర ప్రయాణం ప్రారంభించామన్నారు. వియత్నాం చేరుకుని శుక్రవారం బౌద్ధ విశ్వవిద్యాలయంలోని బుద్ధ హాలులో అంగరంగ వైభవంగా వాటిని ప్రతిష్ఠించామన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో కలిసి బుద్ధుని పవిత్ర అవశేషాలను వియత్నాం తీసుకెళ్లే అవకాశం దక్కడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుని అవశేషాల ప్రదర్శన వేడుక భారతీయ నాగరికత, శాంతియుత సహన వారసత్వానికి శాశ్వత సాక్ష్యంగా నిలుస్తుందని మంత్రి చెప్పారు.



బుద్ధ భగవానుని అవశేషాల ప్రతిష్ఠలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మురమళ్లలో రెండో రోజుకు బ్రహ్మోత్సవాలు

చంద్రప్రభ వాహనంపై ఊరేగిన వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో గవ్యాంతం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. స్వామికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం జరిపించారు. స్వామి చంద్రప్రభ వాహనంపై ఆసీనులై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

రాష్ట్ర క్రీడగా కబడ్డీ గుర్తింపునకు కృషి

● అట్టహాసంగా 12వ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు ● హోరాహోరీగా సాగిన పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ షాన్‌మోహన్

సర్పవరంజంక్షన్, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను ప్రోత్సహించి వారిని రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని, ప్రస్తుతం ఉన్న 2శాతం రిజర్వేషన్‌ని 3శాతానికి సీఎం చంద్రబాబు పెంచి క్రీడలపై ఉన్న ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడరూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఏపీ ఆంధ్ర 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ- 2025 చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎమ్మెల్యే పంతం నానాజీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే సముద్రతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంద న్నారు. బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు సముద్ర తీరం పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. గత నాలుగు నెలలుగా బీచ్‌ని అత్యంత పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్,పంచాయతీ సిబ్బంది విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. రాబోయే 3 నెలల్లో సుమారు రూ. 2.5కోట్లతో పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. పర్యాటకులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు, తాగునీరు, లైట్లు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సముద్రతీరాన్ని కలుషితం చేయకుండా అధికారులకు సహకరించాలని, బీచ్‌ని అపరిశుభ్రంచేసే వారిపై కేసుల నమోదుకు వెనుకాడబోయే ప్రశక్తేలేదన్నారు. ఎన్టీఆర్ బీచ్‌లో గతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేవారని, కరోనా తదితర కారణాలతో బీచ్‌లో ఎటువంటి కార్యక్రమాలు జరగకపోవడంతో రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మే 2 నుంచి 4 వరకు ఏపీకి చెందిన 26 పురుషుల, మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడలద్వారా శారీరక దారుఢ్యంతో పాటూ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. కబడ్డీ క్రీడను రాష్ట్ర క్రీడగా గుర్తింపు ఇవ్వాలని, ప్రో కబడ్డీగా దేశవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. పర్యాటకులకు ఆహ్లాదన్నందించే బీచ్‌లో రానున్న రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను ఈనెల 15-20 నుంచి మచిలీపట్నంలో జరిగే అంతర్జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేస్తామని ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి తెలిపారు. బీచ్ సుందరీకరణకు కృషిచేస్తున్నామని, అతిత్వరలో ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ భావన తెలిపారు. ముందుగా రాష్ట్రం నుంచి ఇక్కడకు విచ్చేసిన 26 మహిళా పురుషుల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బెలూన్లను గాల్లోకి ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించి కలెక్టర్ పోటీలను ప్రారంభించారు. సాయం సమయాన సుందర తీరాన ఎన్టీఆర్ బీచ్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, క్రీడా భివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కేఎస్‌పీఎల్ సీఈవో మురళీధర్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఏపీ గౌడ, ఎస్సీ కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టాప్రకాశ్ గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందు, జీని శ్రీనివాస్, సోదె ముసలయ్య, వీరబాబు, రాజు పాల్గొన్నారు.




కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న బీచ్ కబడ్డీ పోటీలో తలపడుతున్న తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్లు



తూర్పుగోదావరి, చిత్తూరు పురుషుల జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్న కబడ్డీ పోటీ

ఒకే జీడి మామిడి పండుకు మూడు గింజలు

● ఆశ్చర్యంగా తిలకిస్తున్న గ్రామస్థులు



మూడుపిక్కల జీడిమామిడి పండు

మలికిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం పడమటిపాలెంలో అంబటి లక్ష్మీనారాయణకు చెందిన జీడి తోటలో ఒక జీడి పండుకు మూడు గింజలు కాశాయి. సాధా రణంగా ఒక జీడిమామిడిపండుకు ఒక గింజమాత్రమే ఉంటు ంది. పడమటివారిపాలెంలో మాత్రం ఒక పండుకు మూడు గింజలు ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



కల్యాణోత్సవ ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఈవో సుబ్బారావు

సమన్వయంతో పనిచేయండి

● ఉద్యోగులు ఎవరూ సెలవులు పెట్టకండి
● కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

అన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలపై ఈవో వీర్ల సుబ్బారావు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు ఎవరెవరువచ్చారు ఎవ రైనా గైర్హాజరయ్యారా అంటూ ప్రశ్నించారు. అనంతరం కల్యాణోత్సవాల సమయంలో ఎవరూ సెలవులు పెట్టకండి సమన్వయంతో పనిచేయండి అని సూచించారు. ప్రధానంగా స్వామివారి కల్యాణం జరిగే 8వ తేదీ, రథోత్సవం జరిగే 11న భక్తజనం అధికంగా ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అయితే సమీక్షలో పాల్గొన్న ఉద్యోగులు మాత్రం ప్రధానాంశాలు చర్చించకపోవడంతో పెదవి విరిచారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

అన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మస్థాపనకు విశేష కృషిచేసిన జగద్గురువులు ఆదిశంకరాచార్యుల జయంతి పురస్కరించుకుని శుక్రవారం సత్యదేవుడి సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10గంటలకు ఆదిశంకరాచార్యుల చిత్రపఠం పల్లకీలో ఉంచి పండితులు మంత్రోచ్చరణలు, హరిహర శంకర, జయజయశంకర నినాదాలతో ఆలయ తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ చేయించారు. ఈవో సుబ్బారావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ

గ్రామంలో గురు దత్తాత్రేయ ఆలయంలో శంకరాచార్యులు విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉద యం గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం పంచగవ్యప్రాశన, షోడషోపచార పూజలు నిర్వహించి ఉదయం 9.37కి కళాన్యాసం గావించారు. కార్యక్రమంలో దత్త సమా ఖ్య అధ్యక్షుడు మహేంద్రవాడ జగదీష్, వారణాశి సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

సత్యగాయిత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో:

సత్యగాయిత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో శంకరజయంతి పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుబ్రహ్మణేశ్వర ఆలయంలో శంకరాచార్యుల విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం విశేష అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4గంటలకు ఆదిశంకరాచార్యుల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించా రు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, సర్పంచ్ కుమార్‌రా జా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డి.వి.జె.రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి కామర్స్ చిరంజీవి పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దేవస్థానం పండితులు

గొర్రిపూడి వెల్ఫేర్ అసిస్టెంట్‌పై

హిజ్రాల దాడి

● గోల్డ్‌చైన్ అపహరణ
● కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కరప, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కరప మండలం గొర్రిపూడి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనుసూరి రవీంద్రపై గుర్తుతెలియని కొంతమంది హిజ్రాలు దాడిచేసి అతని మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్ రవీంద్ర గత ఏప్రిల్ 30వ తేదీ మధ్యాహ్నం కాకినాడలోని ఒక బ్యాంక్ నుంచి పింఛను సొమ్ము డ్రా చేసి గొర్రిపూడి సచివాలయానికి బయలుదేరారు. కరప మండలం పాతర్లగడ్డ వచ్చేసరికి పలువురు హిజ్రాలు అతని బైక్‌ను చుట్టుముట్టి డబ్బులివ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. బైక్ వెనుక ముందు ఎక్కి పింఛన్ల సొమ్ము ఉన్న బ్యాగ్‌ను లాక్కోబోయారు. వారి బాధ భరించలేక రవీంద్ర పర్స్‌లో నుంచి రూ.50 తీసి ఇవ్వగా సరిపోవని మరో రూ.100 గుంజుకున్నారు. వారిని వదిలించుకుని కొంతదూరం వచ్చి చూసుకోగా మెడలోని 10గ్రాముల బంగారు గొలుసు మాయమైనట్టు గుర్తించాడు. వెనక్కు వెళ్లి చూడగా హిజ్రాలు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై బాధితుడు అదేరోజు సాయంత్రం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తోట సునీత కొంతమంది హిజ్రాల వీడియోలు, ఫొటోలను చూపించగా వారు కాదని బాధితుడు నిర్ధారించినట్టు తెలిసింది. పెనుగుదురు-పాతర్లగడ్డ, పెనుగుదురు-కరప ప్రధాన రహదారులు, వేళంగి రైల్వేట్రాక్, నడకుదురు పరిసరాల్లో రాత్రుళ్లు హిజ్రాలు చేస్తున్న ఆగడాలు భరించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది యువకులను హిజ్రాలు ఆకర్షించి వారి నుంచి సొమ్ములు కాజేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థాయీ సంఘాలు సూచించిన అంశాలపై..

సత్వర చర్యలు చేపట్టాలి

● జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ, మే 2(ఆంధ్రజ్యోతి): స్థాయీ సంఘాలు చర్చించిన, సూచించిన అంశాలన్నింటిపైనా జిల్లాల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సూచించారు. తూర్పుగోదావరిజిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు శుక్రవారం జడ్పీ చైర్మన్, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాల్లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలోని నాలుగు నూతన జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పురోగతిని ఆయా స్థాయీ సంఘాలు సమీక్షించి, మరింత పటిష్టత, సత్వర అమలుకు అధికారులకు సూచనలు చేశారు. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ, సీనరేజీ సర్దుబాటు చెల్లింపులు వెంటనే జరపాలని, పంచాయతీల పరిధిలో జరిగే అన్ని పనులకు తప్పనిసరిగా పంచాయతీ తీర్మానాలతోనే నిర్వహించాలని సంఘాల సభ్యులు కోరారు. ఇప్పటికే చేసిన పనులకు సత్వరం చెల్లింపులు జరపాలని కోరారు. గ్రామీణాభివృద్ధిపై చర్చలో కొత్తగా పింఛన్ల మంజూరు కోసం వేచి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని, ఇందుకు సంబంధిత వెబ్‌సైట్‌ను తెరవాలని సభ్యులు కోరారు. మహిళ, శిశు సంక్షేమంపై చర్చలో బాలికల రక్షణ, శారీరక, మానసిక వికాసం లక్ష్యంగా జిల్లాలో శుక్రవారంనుంచి నిర్వహిస్తున్న కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను కూడా తప్పనిసరిగా భాగస్వాములు చేయాలని సభ్యులు కోరారు. సంక్షేమశాఖల చర్చలో వివిధ సంక్షేమ కార్పొరేషన్లద్వారా అమలుచేస్తున్న స్వయం ఉపాధి యూనిట్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో జడ్పీటీసీ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వైద్యఆరోగ్యశాఖలో ఖాళీ ఉన్న వైద్యులు, పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీచేసి వైద్యసేవలకు విఘాతం లేకుండా చూడాలని సభ్యులు కోరారు. విద్య అంశంపై టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. విద్యుత్‌శాఖపై చర్చలో పీఎం సూర్యఘర్ పథకంద్వారా ఉమ్మడి జిల్లాల్లో అవకాశం ఉన్న ప్రతి కుటుంబానికి రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని జడ్పీచైర్మన్ వేణుగోపాలరావు అధికారులను కోరారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

● ఛేదించిన బిక్కవోలు పోలీసులు ● నలుగురు నిందితుల అరెస్టు
● రూ.41.50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

బిక్కవోలు, మే 2(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ జిల్లాల దొంగల ముఠా గుట్టురట్టయ్యింది. బిక్కవోలు పోలీసులు కేసు ఛేధించి వారిని అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి రూ.41.50 లక్షల విలువ గల చోరీ సొత్తును, నగదును స్వాధీనం చేసుకున్నారని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. శుక్రవారం బిక్కవోలులో ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన అనకాపల్లి జిల్లా మాకవరపు మండలానికి చెందిన దల్లి కామిరెడ్డి(తామవరం), వళ్ల శ్రీను(గిడుతూరు), కచ్చల చిరంజీవి(చినరాచపల్లి), సఖిలేటి సాయి(జంగాలపల్లి)కి చెందిన నలుగురు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరు బైక్ మెకానిక్, లారీ డ్రైవర్, ఐరన్ షాపుల్లో పని చేస్తూ వచ్చిన డబ్బు జల్సాలకు సరిపోక దొంగతనాలకు అలవాటుపడ్డారు. దీంతో వీరు తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి, ఏలూరు, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఇప్పటివరకూ 25చోరీలకు పాల్పడ్డారు. ఈయేడాది జనవరి 9న ఈనలుగురు గతంలో విశాఖపట్నంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించిన బ్రిజా కారులో బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం వచ్చి వరుసగా వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు దొంగిలించి గ్రామంలోని ఇండియా ఏటీఎంను, స్థానిక జ్యూయలరీ షాపులో దొంగతనానికి ప్రయత్నించి విఫలమవ్వడంతో తిరిగి వెళ్లిపోయారు. ఆపై వచ్చిన సమాచారం మేరకు నలుగురు నిందితుల్లో ఒకరైన సఖిలేటి సాయిని తుని రైల్వేస్టేషన్ వద్ద కొయ్యలగూడెంలో దొంగిలించిన మోటారు బైక్‌తో బిక్కవోలు పోలీసులు పట్టుకుని విచారించి రిమాండ్‌కు పంపారు. అయితే నిందితుల్లో మరొకరైన కచ్చల చిరంజీవిని పీటీ కేసులో మాకవరపుపాలెంలో అక్కడి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో అనపర్తి సీఐ, బిక్కవోలు ఎస్ఐలు చాకచక్యంగా పై కేసుల్లో ప్రధాన నిందితులైన దల్లి కామిరెడ్డి, వళ్ల శ్రీనులను గురువారం సాయంత్రం తుని రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసి వారి నుంచి రూ.41.50లక్షల విలువైన సొత్తు, 71 గ్రాముల బంగారు వస్తువులు, కిలో వెండి వస్తువులు, మూడు మో టారు సైకిళ్లు, ఒక కారు, జగనన్న కాలనీ ఇంటి పత్రాలు, గ్యాస్ కట్టర్లు, రూ.9.80 లక్షల నగదు) స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ భవ్యకిషోర్ వివరించారు. ఈ కేసును ఛేధించిన అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్‌గా వినయ్



యానాం, మే 2 (ఆంధ్రజ్యోతి): యానాంకి చెందిన ఐఆర్ఎస్ అధికారి మల్లిపూడి వినయ్ చెన్నై ఎయిర్‌పోర్టు కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2017 బ్యా చ్‌కు చెందిన వినయ్ చెన్నైలోని జీఎస్టీ ఇంటె లిజెన్స్ విభాగంలో ఆఫీసర్‌గా పని చేశారు. ప్రస్తుతం వినయ్ చెన్నై ఎయిర్‌పోర్టులో కీలక బాధ్యతలు చేపట్టారు. స్మగ్లింగ్ నిరోధక చర్యలు, ప్రమాణికుల రాకపోకలు, నిషిద్ధవస్తువులు పట్టివేత, కస్టమ్ చట్టం అమలును పర్యవేక్షించడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నారు.

గంజాయి కేసులో పదేళ్ల కఠిన కారాగార శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో 266 కేజీల గంజాయిని లారీలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడు బొద్దిక సురేష్ నేరం రుజువు కావడంతో అతనికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ రాజమండ్రి 1వ అదనపు సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి ఆర్.శివకుమార్ తీర్పును వెల్లడించారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే నర్సీపట్నం నుంచి వరంగల్‌కు లారీలో బొద్దిక సురేష్ గంజాయిని రవాణా చేస్తుండగా పోలీసులు అతన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. అప్పట్లో బొమ్మూరు స్టేషన్‌లో బొద్దిక సురేష్‌పై క్రైమ్‌నెంబరు 375/2017లో సెక్షన్ 8(సి),20 (బి)(2)(సి)ఆఫ్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద రెండో ముద్దాయిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో అతన్ని రిమాండ్‌పై సెంట్రల్ జైలుకు తరలించారు. ఈకేసు పూర్వాపరాలను న్యాయమూర్తి పరిశీలించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ లక్ష్మణ్‌నాయక్ బలమైన వాదనలు వినిపించారు. తుది తీర్పును న్యాయమూర్తి వెల్లడించారు. ఈకేసులో అప్పటి దర్యాప్తు అధికారి కే.నాగమోహన్‌రెడ్డి, ప్రస్తుత సీఐ పి.కాశీవిశ్వనాధంలు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడటానికి దోహదపడ్డారు.

దొంగతనంగా జామాయిల్ తోట నరికివేత

● బూరుగువాయి తండాలో కాంట్రాక్టర్‌కు విక్రయం

ఎటపాక, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు చెందిన జామాయిల్ తోటల్లో కొందరు దొంగలు పడి అర్ధరాత్రి జామాయిల్ కర్రలు(సైజులు) నరికి తీసుకెళ్లి, గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఇటీవల అల్లూరిజిల్లా ఎటపాక మండలం, సీతాపురం, కుసుమనపల్లి గ్రామాల్లో ఈ జామాయిల్ పంట(కర్రల) దొంగతనాలు అధికమయ్యాయి. మూడురోజుల క్రితం సీతాపురం గ్రామానికి చెందిన వల్లభనేని విష్ణుమూర్తి జామాయిల్ తోటలోని సుమారు 6టన్నుల జామాయిల్ పంటను నరికి ఎత్తుకెళ్లారు. దొంగతనంగా తోటల్లో నరికిన పంటను బూరుగువాయి తండాలో ఓ జామాయిల్ కాంట్రాక్టర్ కొనుగోలు చేస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. ఆగ్రామంలో వేబ్రిడ్జి ఏర్పాటుచేసి, పగలు రాత్రి తేడా లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దొంగతనంగా జామాయిల్ కర్రలలోడును తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొందరు రైతులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఆ ట్రాక్టర్ కుసుమనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిగా ప్రచారం సాగుతోంది. కొందరు వ్యక్తులు ఇటీవల ముఠాగా ఏర్పడి, జామాయిల్ తోటలను నరికి, దొంగతనంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు జమాయిల్ తోటల నరికివేత దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మ్యాట్రిమోనిలో పరిచయమై

దోషాల పేరుతో బంగారు వస్తువుల దోపిడీ

రాజమహేంద్రవరంసిటీ, మే2 (ఆంధ్రజ్యోతి): పితృదోషం పూజలు పేరులో ఒంటరి మహిళను గుర్తుతెలియని వ్యక్తి మోసంచేసి బంగారం, వెండి వస్తువులతో ఉడాయించాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే నెల్లూరుకి చెందిన జి.నాగభారతి అనే 30ఏళ్ల తన భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటుంది. రెండో వివాహం కోసం ప్రయత్నం చేస్తున్న క్రమంలో మెట్రిమోనిలో రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. అతను నీకు నాకు పితృదోషాలు ఉన్నాయని రాజమహేంద్రవరంవస్తే కోటిలింగాల రేవులో పూజలుచేసి పరిహారం చెల్లిస్తే దోషాలు పోతాయని చెప్పడంతో ఆ గుర్తు తెలియని వ్యక్తి మాటలు నమ్మిన భారతి గతనెల 20న రాజమహేంద్రవరం వచ్చింది. దీంతో ఆమెను రిసీవ్ చేసుకున్న సదరు గుర్తుతెలియని వ్యక్తి ఆమెను కోటిలింగాల రేవుకు తీసుకువెళ్లి పితృదోషాల పూజలు చేయించడానికి సిద్ధం చేసి ఆమెను ఒంటిమీద ఉన్న బంగారం, వెండి వస్తువులను తీసి స్నానం చేసి రమ్మని చెప్పాడు. దీంతో ఆమె వాటిని తీసి అతనికి ఇచ్చి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి వస్తువులతో సదరు వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీంతో ఆమె ఖంగుతిని గత పదిరోజులుగా రాజమహేంద్రవరంలో ఆ వ్యక్తి కోసం వెతికి చివరికి శుక్రవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. సదరు వ్యక్తి పేరు కూడా ఆమెకు తెలియదని అతని ఫొటో వుందన తన ఫిర్యాదులో పేర్కొంది. మొత్తం 34 గ్రాముల బంగారు అభరణాలు, 26 తులాల వెండి పట్టీలు అపహరించుకుపోయాడని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కాకినాడ క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ దుకాణంలో చోరీ కేసులో పట్టుబడ్డ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ జిల్లా కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మనాభనగర్ అన్నమ్మ ఘాటీ సెంటర్‌కు చెందిన వెలుగుబంటి వీరబాబు ఏప్రిల్ ఒకటో తేదీ అర్ధరాత్రి పులవర్తివారి వీధిలో గల మహీంద్రా స్వీట్‌స్టాల్‌లో చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో వాదోపవాదనలు ముగిసిన తర్వాత నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి తీర్పు నిచ్చినట్లు సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు.

కాకినాడ

రెవెన్యూ అంశాలపై సిబ్బందికి శిక్షణ

పెద్దాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు ఆర్డీవో శ్రీరమణి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పెద్దాపురం, గండేపల్లి, కిర్లంపూడి, ఏలేశ్వరం, మండలాలకు చెందిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లకు శుక్రవారం మొదటి విడత శిక్షణ ఇచ్చారు.



కిశోరి వికాసం శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీవో దుర్గాదేవి

కిశోరి వికాసం శిక్షణ తరగతులు ప్రారంభం

పిఠాపురం/గొల్లప్రోలు, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ పిఠాపురం ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి... కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవడం, బాలల హక్కులు, చట్టాలు తదితర అంశాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జీఎంఎస్‌కేలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.



పిఠాపురం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రమేష్

పిఠాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్యవైశ్య మహాసభకు అనుబంధ ఆర్యవైశ్య సంఘం పిఠాపురం మండల శాఖ అధ్యక్షుడిగా రేపాక రమేష్ ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది వీవీ నగేష్ ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా కంబంపాటి శ్రీరామ్, కోశాధికారిగా కంచర్ల నగేష్‌గుప్తా ఎన్నికైనట్టు ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కుమార్, జోన్ చైర్మన్ ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, బోడా సతీష్, దంగేటి సత్యనారాయణమూర్తి, చక్కా శోభనాద్రి, పైండా రాజా తదితరులు అభినందించారు.

చిన్నారులే విద్యా నిధికి అసలైన వారసులు

అద్వైత ఆశ్రమ ఆచార్యులు కృష్ణానంద

పిఠాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): చిన్నారులే విద్యా నిధికి అసలైన వారసులని శ్రీరామకృష్ణ అద్వైత ఆశ్రమ ఆచార్యులు కృష్ణానంద పేర్కొన్నారు. పట్టణ శివారులోని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తాత్విక బాల వికాస వేసవి శిక్షణ శిబిరాన్ని ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ హుస్సేన్ షాతో కలిసి శుక్రవారం ఆయన జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. పుట్టిన నాటి నుంచి చనిపోయే వరకు నేర్చుకున్నవాడే యథార్థమైన నిత్య విద్యార్థి అన్నారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అంతర్జాలం ద్వారా అనుగ్రహభాషణ చేశారు. కార్యక్రమంలో తాత్విక బాల వికాస ప్రధన కన్వీనర్ ఏవీవీ సత్యనారాయణ, యోగ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జ్యోతుల నాగేశ్వరరావు, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ కేవీఎస్ఎస్ ప్రసాద్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎన్‌టీవీ ప్రసాదవర్మ, గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కృష్ణానంద

'రోగుల రద్దీకి అనుగుణంగా మంచాల ఏర్పాటు'

జీజీహెచ్ (కాకినాడ), మే 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సౌలభ్యం కోసం మెడికల్ వార్డుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బెడ్‌లు (మంచాలు) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ తెలిపారు. శుక్రవారం ఆయన పలు వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో అదనంగా జెరియాట్రిక్, హెమటాలజీ సేవలు తీసుకొస్తున్నట్టు తెలిపారు. రోగుల సంఖ్య తక్కువగా ఉన్న వార్డుల్లో నుంచి మంచాలు తీసుకువచ్చి మెడికల్ వార్డుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మంచాల సమస్యతో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు ఉండటంతో రోగులతో పాటూ వైద్యులకు తీవ్ర అసౌకర్యంగా ఉండటాన్ని గుర్తించి, ప్రత్యామ్నాయంగా జనరల్ వార్డులో మంచాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఎంఈ ఆదేశాల మేరకు మెడికల్ యూనిట్లకు సంబంధించి వరండాలో వయో వృద్ధులకు ప్రత్యేక జరియాట్రిక్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మెడికల్ విభాగం పర్యవేక్షణలో జరిగే రక్తసంబంధిత హెమటాలజీలో బెడ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో క్రమ పద్ధతిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పి.యశోదమ్మతో చర్చించారు.



రోగులను వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్




ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

ఆరుద్ర నక్షత్ర పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శుక్రవారం అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ప్రత్యేక పూజలు జరిపారు. మహా గణపతి పూజ, మహన్యాస పారాయణ, పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి పంచామృతాలు, పళ్ల రసాలు, చెరకు రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. లలితాదేవికి కుంకుమార్చన జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారి ఉత్సవమూర్తికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.



ముగ్గురికి ఉద్యోగోన్నతి

కార్పొరేషన్ (కాకినాడ), మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థలోని హెల్త్ సెక్షన్‌లో ముగ్గురికి ఉద్యోగోన్నతి లభించింది. ఆరు హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ ఉండగా మూడింటిని భర్తీ చేశారు. ఏడవ సర్కిల్‌లో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్న అనుసూరి సత్తిబాబు, 13వ సర్కిల్‌లో పీహెచ్ వర్కర్‌గా పనిచేస్తున్న రాజు దుర్గారావు, నైట్ శానిటేషన్‌లో మేస్త్రీగా పనిచేస్తున్న ఎర్ర దుర్గారావుకు హెల్త్ అసిస్టెంట్లుగా స్టాండింగ్ కమిటీ కౌన్సిల్ తీర్మానంతో కలెక్టర్ ఆమోదం మేరకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ భావన ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జనన, మరణ విభాగంలో విధులు కేటాయించినట్టు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దాట్ల పృధ్వీచరణ్ చెప్పారు.

రైతులకు బరకాలు పంపిణీ

కొత్తపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో జనసేన సీనియర్ నేత, రైతు విభాగం ప్రతినిధి గవర రాంబాబు ఆధ్వర్యంలో రైతులకు బరకాలను ఉచితంగా పంపిణీ చేశారు. జన సైనికులు సానా లోవరాజు, చింతలపూడి వెంకటరమణ, గంధం గంగ, పలువురు రైతులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

కొత్తపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): కొండెవరం గ్రామ దేవత పెద్దింటమ్మ జాతర అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనకు కొండెవరం, సమీప ప్రాంతాల నుంచి సుమారు 6వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

12న 'మాలల రణభేరి'

తాళ్లరేవు, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెక్లారిన్ మైదానంలో ఈ నెల 12న జరిగే 'మాలల రణభేరి'కి మాలలంతా తరలిరావాలని దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కన్నీడి వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం తాళ్లరేవు అంబేడ్కర్ భవనం వద్ద రణభేరి పోస్టర్లను దళిత నాయకులు ఆవిష్కరించారు. కుసుమ శ్రీనివాస్, జక్కుల ప్రసాద్, దడాల బుజ్జిబాబు, కన్నీడి మంగామణి, కమిడి ఈశ్వరీబాయి, పులపకూర రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

సామర్లకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆటో స్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు శుక్రవారం ప్రారంభించారు. పలువురు ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఆధ్యాత్మిక విషయ జ్ఞాన పరీక్షలో విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం



సామర్లకోట భీమేశ్వరాలయంలో ఆదిశంకరాచార్య చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా శంకర జయంతి

పిఠాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. శృంగేరీ శంకర మఠం నిర్వహణలోని మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ఆదిశంకరులకు అభిషేకం, అర్చన నిర్వహించి ఉపనిషత్ పారాయణ చేశారు. అనంతరం 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆధ్యాత్మిక విషయ జ్ఞాన పరీక్షలు (క్విజ్ పోటీలు) నిర్వహించారు. 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా తొలి మూడు స్థానాలు సాధించిన పి.జయంత్, వి.సంపత్, య. దుర్గాభవానీలకు నగదు పురస్కారాలు అందజేశారు. మహాలక్ష్మి ఆలయ ధర్మాధికారి ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ, రాయప్రోలు కామేశ్వరశర్మ, వారణాసి కామేశ్వరశర్మ, వీహెచ్‌పీ నాయకుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్యులు జయంతిని కుమారరామ భీమేశ్వరాలయంలోని నంది మండపం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, తురుమళ్ళ శేషకుమార్ వేదమంత్రోచ్ఛారణలతో శంకరాచార్యులు చిత్రపటానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో ఆదిశంకరాచార్య జయంతి నిర్వహించారు. స్వామి చిత్రపటానికి పుష్పార్చన జరిపారు.



పిఠాపురం నుంచి అమరావతి బయల్దేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అమరావతి తరలిన కూటమి శ్రేణులు

పెద్దాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు పట్టణ, రూరల్ ప్రాంతాల నుంచి బయల్దేరిన పది బస్సులను ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో శ్రీరమణి జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీవోలు శ్రీలలిత, హిమమహేశ్వరి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), నూనె రామారావు, జల్దాని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలోని కూటమి నేతలు అమరావతి తరలివెళ్లారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బస్సులు, వ్యాన్లు, కార్లలో వెళ్లారు. ఆయా పార్టీల నేతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చినరాజప్ప ఆదేశాల మేరకు నాలుగు బస్సుల్లో టీడీపీ కార్యకర్తలు అమరావతి బయల్దేరి వెళ్లారు. మఠం సెంటరు వద్ద బస్సులను టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు.



పెద్దాపురంలో బస్సులను ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీరమణి



సామర్లకోట నుంచి బయల్దేరిన తెలుగు తమ్ముళ్లు





సామర్లకోట, పెద్దాపురంల్లో భాస్కరరామారావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

భాస్కరరామారావుకు నివాళి

సామర్లకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరామారావు నాల్గవ వర్ధంతి సందర్భంగా స్థానిక మఠం సెంటర్లో టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్, భాస్కరరామారావు మనుమడు మెర్ల అగస్త్యయ్య శుక్రవారం ప్రారంభించారు. భాస్కరరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమాశంకర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కర రామారావు నాల్గవ వర్ధంతిని కాండ్రకోటలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గవరసాన రాజశేఖర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కరరామారావు అభిమానులు పాల్గొన్నారు.

మేల్ నర్సుపై సస్పెన్షన్ వేటు

జీజీహెచ్ (కాకినాడ), మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న పోలాబత్తిన శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే వేడుకలకు పలువురు నర్సులు పురస్కారాలు అందుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు వారికి సిఫారసు చేసిన నర్సింగ్ సూపరింటెండెంట్, సూపరింటెండెంట్ తదితరులపై అసందర్భ ఆరోపణలు చేశాడు. కలెక్టర్ ఆమోదాన్ని సైతం వ్యతిరేకించిన శ్రీనివాసరావుపై నర్సింగ్ అసోసియేషన్ నాయకులు, ఏపీఎన్జీవో నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని నియమించారు. విచారణ అనంతరం శ్రీనివాసరావు చేసిన ఆరోపణలను అవాస్తవంగా నిర్ధారించి సస్పెండ్ చేశారు.

16 మద్యం సీసాలు స్వాధీనం

గొల్లప్రోలు/పిఠాపురం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణం, తాటిపర్తి గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి కృష్ణకుమారి ఆదేశాల మేరకు శుక్రవారం దాడులు నిర్వహించారు. జుత్తిగ లలితాకుమారి, ఏనుగుపల్లి నాగబాబులను అరెస్టు చేసి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పిఠాపురం మండలం పి.దొంతమూరులో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పి.దొంతమూరు, వెల్దుర్తి గ్రామాల్లో నవోదయం-2.0లో భాగంగా సారా వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ వి.శివరామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ క్యాంపులు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓఆర్ఎస్ క్యాంపులు నిర్వహించారు. వేసవిలో ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వలన కలిగే ప్రయోజనాలను, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

పెద్దాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల రక్షణకు ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి పేర్కొన్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు ఆంజనేయస్వామి గుడి సెంటర్లో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు బేబీరాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, గూనూరి రమణ, తైనాల శ్రీను, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎస్తేరు రాణి, దాడి బేబి, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళా రూపాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

అనూరులో ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ జెండాను సంఘ సీనియర్ నాయకులు నాగరాజు ఆవిష్కరించారు. ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, పారిశుధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చ యేసు, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి నాయకులు రెడ్డి దుర్గాదేవి, ఏపీఆర్‌సీఎస్ నాయకులు నవీన్, నాగరాజు, బ్రహ్మం పాల్గొన్నారు.

కులగణన ప్రకటనపై బీసీల హర్షం

కాకినాడ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి) జనగణనతో పాటు కులగణనను కూడా దేశవ్యాప్తంగా జరిపిస్తామని ప్రధాని మోదీ చెప్పడంపై నగరంలోని బీసీలు హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల రమణ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ఏప్రిల్ 27న విజయవాడలో ర్యాలీ చేస్తూ అరెస్టై నిరంతర పోరాటం చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. జనరల్ సెక్రటరీ మానే నాగేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తుల భవానీ, ఏసుబాబు, లీలావతి, వెంకటేష్ కాలా, గణేష్, పితాని సురేష్, అధిక సంఖ్యలో మహిళలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు జీతం బకాయిలు చెల్లించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), మే 2 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ మాట్లాడుతూ డ్రైవర్లకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించట్లేదని, అది కూడా కేవలం రూ.7,800 ఇస్తున్నారన్నారు. అతి తక్కువ వేతనాలు ఇస్తూ నెలలు తరబడి బకాయి పెడితే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ సాయికుమార్, సెక్రటరీ మల్లికార్జునరావు, ట్రెజరర్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



కోలాట ప్రదర్శన ఇచ్చిన కళాకారులు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

గొల్లప్రోలు, మే 2 (ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడి సంబరాల్లో భాగంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఉమారామలింగేశ్వరస్వామి కోలాట భజన సమాజం ఏర్పడి ఎనిమిది వసంతాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 244మంది చిన్నారులతో అతి పెద్ద కోలాట భజన బృందంగా గుర్తింపు పొందిన వీరు ఇచ్చిన కోలాట నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు చెరుకూరి వీరబాబు, దత్తు, ఆదిత్య శర్మ, నందీశ్వర సేవా సభ్యులు, గోపాలకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

కిర్లంపూడి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ శివారున వెలసిన శ్రీశ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన గూనూరు సత్యనారాయణ, నాగ జ్యోతి దంపంతుల కుమారుడు సందీప్ అలేఖ్య దంపతులు అన్నదానానికి ఆర్థిక సహాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై.రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యం బంద్ విజయవంతం



మన్యం బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు



చింతూరు సెంటరులో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

రంపచోడవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ డీఎస్సీ సాధనకై ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, షాపులు మూయించివేసి వాహనాలను నిలుపుదల చేశారు. గ్రామంలో ర్యాలీచేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయింపు ఇవ్వాలని, స్థానిక ఆదివాసీలకు నూరుశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ పునరుద్ధరణ, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంఘాలు, వామపక్షాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు: మన్యంలో నూరుశాతం ఉద్యోగావకాశాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలన్న డిమాండ్‌తో ఆదివాసీ సంఘాలు శుక్రవారం మన్యం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు బంద్ ప్రశాంతంగా జరిగింది. చింతూరు ప్రధాన రహదారిపై ఆదివాసీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. మన్యంలో ఆదివాసీలకే నూరుశాతం ఉద్యోగాలు కేటాయించేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు మన్యంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సీసం సురేష్, పేగ ఎంపీటీసీ సున్నం నాగరాజు, నాయకులు కారం సుబ్బారావు, పాంద్రం నాగార్జున, పొడియం లక్ష్మణ్, ఉద్యోగ సంఘాల నాయకులు పండా కృష్ణయ్య, బొగ్గా ముత్తయ్య, తుర్రం వెంకటయ్య, రవి పాల్గొన్నారు.

అడ్డతీగల: ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీకి క్యాబినెట్ ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరుతూ శుక్రవారం తలపెట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. వ్యాపారుస్తులు దుకాణాలు మూసివేశారు. మండల కేంద్రమైన అడ్డతీగలలో ఏఐకేఎంఎస్, న్యూడెమోక్రసీ, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పీడీఎస్‌యూ ఐక్యకార్యాచరణ సమితిగా ఏర్పడిన బంద్‌ను నిర్వహించారని న్యూడెమోక్రసీ నాయకులు ఐ.రమణ తెలిపారు. తొలుత స్థానిక సీతపల్లి సెంటర్‌లో ధర్నాను నిర్వహించారు. తదుపరి గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించి దేవి సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఏజెన్సీ డీఎస్సీ కోసం నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘ నాయకులు సమర్ల కృష్ణ, తీగల బాబూరావు, వెంకటరమణ, అంజి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని మెగా డీఎస్సీ ద్వారా గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందనే డిమాండ్‌తో రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాల్లో బంద్ విజయవంతంగా జరిగింది. ఆర్టీసీ బస్సులు, ప్రయివేట్ వాహనాలు తిరగలేదు. వ్యాపారస్తులు కూడా స్వచ్ఛందంగా బంద్ పాటించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వంతు బాలకృష్ణ, వజ్రపు అప్పారావు పాల్గొన్నారు.

వై.రామవరం: ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ గిరిజన, ఆదివాసీ సంఘాలు తలపెట్టిన మన్యం బంద్ శుక్రవారం వై.రామవరంలో ప్రశాంతంగా జరిగింది. గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.శాంతిరాజు ఆధ్వర్యంలో యార్లగడ్డ, పి.యర్రగొండ, పనసల పాలెం, తోటకూరపాలెం, చవిటిదిబ్బలు, వై.రామవరంలో బైక్ ర్యాలీలు జరిపి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను నిలిపివేశారు. దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. కార్యక్రమంలో నాయకులు గడుతూరి మల్లికార్జునరావు, పల్లాల లక్ష్మణరెడ్డి, చంద్రబోస్, రోలుపల్లి కొండబాబు కృష్ణారెడ్డి, గుడ్ల బాబు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: మండల పరిధి రేఖపల్లి జంక్షన్‌లో శుక్రవారం గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. ఆదివాసీ, గిరిజన సంఘాలు రేఖపల్లి జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. బంద్ నేపథ్యంలో మండల కేంద్రమైన వీఆర్‌పురం, రేఖపల్లి గ్రామాలలోని దుకాణాలన్నీ మూతపడ్డాయి. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సున్నం రాజు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ పూనెం ప్రదీప్‌కుమార్, తుర్రం బాబూరావు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎటపాక: ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలంటూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఏజెన్సీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్‌లో భా గంగా గిరిజన సంఘాల నాయకులు, గిరిజన నిరుద్యోగులు విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహ దారిపై లక్ష్మీపురంవద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్‌దొర మాట్లాడారు. మెగా డీఎస్సీలో ఏజెన్సీ పోస్టుల భర్తీని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.



ఎటపాక: లక్ష్మీపురంలో రాస్తారోకో చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు





రేఖపల్లి జంక్షన్‌లో , వై.రామవరంలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ

వై.రామవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 40 సీట్లు ఉన్నాయని వీటిలో ఎస్టీకి 36, ఓసీ 1, బీసీ 1, ఎస్సీ 1, ఏఐక్యూ 1 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈనెల 18లోగా బయటగానీ కళాశాలలోగానీఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

అమరావతికి తరలివెళ్లిన కూటమి నాయకులు

దేవీపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి పునఃప్రారంభం కార్యక్రమానికి మండల టీడీపీ అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన వాహనాల్లో చొప్పకొండ, పాముగండి, వి.రామన్నపాలెం, ఇందుకూరు, ఇందుకూరుపేట తదితర గ్రామాల నుంచి వెళ్లారు.



అమరావతికి వెళుతున్న టీడీపీ నాయకులు

వై.రామవరంలో అఘోరాలు ప్రత్యక్షం



వై.రామవరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో తిరుగాడే అఘోరాలు ఒక్కసారిగా మారుమూల గ్రామాల్లో కనబడితే ప్రజలు వింతగా చూస్తుంటారు. అల్లూరి జిల్లా వై.రామవరంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ నలుగురు అఘోరాలు బొలెరో వ్యానులో వచ్చి హల్‌చల్ చేశారు. భద్రాచలం వెళ్లేందుకు దారి అడిగేందుకు ఓ కిరాణాషాపువద్ద ఆగారు. ఇటు వెళ్లలేరు అని హిందీలో వారికి చెప్పడంతో కొంతదూరం వెళ్లి అటవీ ప్రాంతంలో దారి తెలియకపోవడంతో అక్కడి నుంచి వెనుతిరిగారు. అక్కడున్నవారు అఘోరాలను వింతగా చూపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రాజధాని పునర్నిర్మాణంతో యువతకు బంగారు భవిష్యత్







జగ్గంపేట: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జ్యోతుల నవీన్, ప్రత్తిపాడు: అమరావతి సభలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్య ప్రభ, ఏలేశ్వరం:అమరావతి తరలి వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

● అమరావతి సభకు తరలిన కూటమి నాయకులు, కార్యకర్తలు

జగ్గంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా దూరదృష్టి ఉన్న గొప్ప నాయకుడని, రాష్ట్ర రాజధాని అమరావతి భావితరాలకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలు, ప్రపంచ స్థాయి వసతులతో నిర్మాణం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. శుక్రవారం జగ్గంపేట టీడీపీ పార్టీ కార్యాలయం నుంచి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అమరావతిలో జరిగే అమరావతి పునర్నిర్మాణ ప్రారంభ సభకు జగ్గంపేట నియోజకవర్గం నుంచి 14బస్సులు, కార్లలో 800 మంది బయల్దేరి వెళ్లారు. బస్సులను జ్యోతుల నవీన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అమరావతి అభివృద్ధికి రూ.లక్ష కోట్లతో మాస్టర్ ప్లాన్‌ను కూటమి ప్రభుత్వం రూపొందించిందన్నారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జనసైనికులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, పైడిపాల సూరిబాబు, బస్వా చిన్నబాబు, సర్పంచులు బుసాల విష్ణుమూర్తి, సర్వసిద్ధి లక్ష్మణరావు, తొట్టిపూడి నాగేశ్వరరావు, ఉప్పలపాటి బుల్లి అబ్బులు, బొదిరెడ్ల సుబ్బారావు, రాయిసాయి, మండపాక అప్పన్నదొర, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభకు వెళ్లే బస్సులకు గండేపల్లిలో టీడీపీనాయకులు జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు మాట్లాడుతూ మన బిడ్డల భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల భాస్కరరావు, బొల్లాంరెడ్డి రామకృష్ణ, గండేపల్లి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. యల్లమిల్లి గ్రామం నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు సుంకవిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామాధ్యక్షుడు మద్దిపూడి వీరవెంకటసత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి, చీకట్ల నాగరాజు, కనిపే శేషయ్య, పాక నాగరాజు, రాము, కూటమి కార్యకర్తలు తదితరులు అమరావతి సభకు తరలివెళ్లారు.



తుని రూరల్: అమరావతి యాత్రకు జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సభకు శుక్రవారం ప్రత్తిపాడు మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఉత్తరకంచి, పెదశంకర్లపూడి, ఒమ్మంగి తదితర గ్రామాల నుంచి బయల్దేరిని బస్సులను టీడీపీ నాయకులు జువ్విన తిరుపతిరావు, సుంకరసోమరాజులు జెండాలు ఊపి ప్రారంభించారు. కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా శుక్రవారం అమరావతిలో పునః ప్రారంభ సభలో పాల్గొన్నారు. రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకున్న ఆమె ఇంటి వద్ద విశ్రాంతి తీసు కున్నారు. శుక్రవారం అమరావతిలో నిర్వహించిన అమరావతి పునఃప్రారంభ సభలో ఆమె పాల్గొన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణ ప్రారంభోత్సవ సభకు మండలం నుంచి భారీ స్థాయిలో ప్రజలు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ మండలఅధ్యక్షుడు బద్ది రామారావు, సీనియర్ నేత పర్వత సురేష్ జెండా ఊపి బస్సులను పంపారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతుందని ఆశాభావాన్ని నేతలు వ్యక్తం చేశారు. చింతంనీడి కుమార్, మేకల కృష్ణ, బుర్రా లచ్చబాబు, బుర్రా వాసు పాల్గొన్నారు.

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి సభకు అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాలతో తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో తరలి వెళ్లారు. తునిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ జెండా ఊపి అమరావతికి బస్సు యాత్రను ప్రారంభించారు. ఆయన వెంట గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్‌కుమార్, అల్లు రాజు, జల్లువాసు, సిద్ధాంతపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని సభకు మండలం నుంచి కూటమి కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బస్సులను టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, వెలగా వెంకట కృష్ణారావు, చింతకాయల రవికుమార్, బి.సత్యనారాయణ, పెనుముచ్చు ప్రవీణ్, ఎంపీడీవో వెంకట నారాయణ, ఏపీవో రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్స వేడుకకు మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కూటమి నేతలు, ప్రజలు తరలివెళ్లారు గ్రామాల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో బస్సుల్లో అమరావతి తరళివెళ్లారు. బస్సులను ఆయా గ్రామాల నాయకులు ప్రారంభించారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి అన్నారు. శుక్రవారం అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి పట్టణ, మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అమరావతి వెళ్లే బస్సులను కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, నారాయణస్వామి జెండా ఊపి ప్రారంభించారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఏలేశ్వరం, మే 2(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణపై ప్రత్యేవ శ్రద్ధ తీసుకోవాలని సీడీపీవో పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ నేతృత్వంలో కిశోర్ వికాశం వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు.ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, కొప్పుల బాబ్జి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణే ధ్యేయం

రౌతులపూడి, మే 2(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిషోరి వికాసంపై సీడీపీవో టీడీఆర్ పద్మావతి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీవో పద్మావతి మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యబాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, హైస్కూల్ చైర్మేన్ షేక్ సలీం, పసగడుగుల రమణ, విస్తరణ అధికారి పి.జానకిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠ సమాజం

శంఖవరం, మే 2(ఆంధ్రజ్యోతి): కిషోర వికాసంతో పటిష్టమైన సమాజం ఏర్పడుతుందని, చిన్నారులను ఉన్నత చదువులు చదివించాలని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, వెన్నా శివ, జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, మేకల కృష్ణ, గాబు సుభాష్, ఈగల దేవుళ్ళు, బుర్రా వాసు, వైద్యులు రాజీవ్, ఐసిడియస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్లు లేక అవస్థలు

మోతుగూడెం, మే 2 (ఆంధ్రజ్యోతి): గుత్తేదారు కార్మికులు ఇళ్లు లేక నానా అవస్థలు పడుతున్నారని సీఐటీయూ నాయకుడు ఎర్రంశెట్టి శ్రీను అన్నారు. కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. శ్రీను ఆధ్వర్యంలో గుత్తేదారు కార్మికులు సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ జి.వాసుదేవరావును మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జెన్‌కోలో ఖాళీగా ఉన్న ఇళ్లను ఇవ్వాలని కోరారు. వైద్య సదుపాయం కల్పించాలన్నారు. కార్మికులు చింతా రాంబాబు, టీవీ రమణ, ప్రేమ్‌సన్, పేపకాల శ్రీను, దొడ్డి మల్లేష్, సీత, శ్రీను పాసిరాజు పాల్గొన్నారు.

జిల్లాలో 11వేల గృహాల నిర్మాణ లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ

ప్రత్తిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఈఏడాది 11వేల గృహాల నిర్మాణం లక్ష్యమని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీడీ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 5వేల గృహాలు నిర్మించామని, మరో 6వేల గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. వీటిలో పునాది, రూఫ్‌లెవెల్‌కు చేరుకున్న గృహాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎస్సీ, బీసీల ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70వేలు, కొండలపై ఉండే గిరిజనులకు రూ.లక్ష వంతున నిధులు విడుదల చేశామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 274 గృహాల నిర్మాణాలు లక్ష్యంగా కాగా 80 గృహాలే పెండింగ్‌లో ఉన్నాయని స్థానిక హౌసింగ్ డీఈ సువర్ణరాజు తెలిపారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఏపీఎం వై. వెంకట్, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండల హౌసింగ్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డకొండ భూమి పేదలకు దక్కే వరకు పోరాటం



కె.గోపాలపురంలో జెండాను ఎగురవేస్తున్న ప్రధాన కార్యదర్శి రమేష్

గండేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మేడే వారోత్సవాల్లో భాగంగా గండేపల్లి మండలం కె.గోపాలపురంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ శుక్రవారం మేడే జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.గోపాలపురం-మల్లిశాల గ్రామాల మధ్యలో ఉన్న సర్వే నెంబరు 353లో గల 508 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు అడ్డకొండ భూమిని నిరుపేదలకు పట్టాలుగా మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుల కూలీ సంఘం ఆధ్వర్యంలో దశాబ్దాలుగా అనేక పోరాటాలు చేస్తూ కుట్ర కేసులు, దాడులను ఎదుర్కొంటున్నా నేటికీ ఈసమస్య పరిష్కారంలో అధికారులు, పాలకులు చొరవ చూపకపోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం నిరుపేదలకు పట్టాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, ఏపీఆర్‌సీఎస్ నాయకులు డి.సురేష్, గ్రామ నాయకులు వేమగిరి వెంకటేశులు, కోడి కృష్ణ, లాజరు, పోచమ్మ పాల్గొన్నారు.

సత్యదేవుని కల్యాణానికి తరలిరండి

ప్రత్తిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని దివ్య కల్యాణానికి తరలి రావాలని ధర్మవరంలో శుక్రవారం సత్యదేవ ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈనెల8న అంగరంగ వైభవంగా జరిగే సత్యదేవుని వార్షిక కల్యాణ మహోత్సవాలకు తరలిరావాలని కృష్ణబాబు కోరారు. చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో ఈర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగే కల్యాణోత్సవాన్ని జయప్రదం చేయాలని కృష్ణబాబు కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మోతుగూడెం, మే 2(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా లోయర్ సీలేరులో విద్యుత్ కళాభారతి ఏపీ జెన్‌కో ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు లెమన్, స్పూన్, చైర్స్ బొట్టు ఆట నిర్వహించారు. గెలిచిన మహిళలకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చినకామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ వరప్రసాద్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అంద జేశారు. అనంతరం ముందుగా బాలబాలికలచే భరతనాట్యం ప్రదర్శించారు. జెన్‌కో ఉద్యోగులు వేసిన 'కాపలా' 'తప్పిన వేట' సాంఘిక నాటకాలను ప్రదర్శించారు. బాలబాలికలు డ్యాన్స్‌లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉద్యోగులు సతీష్ రాఘవన్, పిల్లే పూర్ణిమ, రత్నాకర్ కిరణ్, దారబాబు, వాసు, బీఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



కాపలా నాటకంలోని సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

ఘనంగా చండీహోమం



అన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ సప్తపతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ఏలేశ్వరం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులందరికీ మేలు జరుగుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. శుక్రవారం ప్రకృతి వ్యవసాయ అధికారులు నేతృత్వంలో పెద్దనాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీటీసీ సభ్యులు పసల సూరిబాబు, బస్వా ప్రసాద్, నూకతాటి ఈశ్వరుడు, పలివెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి

ఏలేశ్వరం, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. శుక్రవారం పెద్దనాపల్లిలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, జ్యోతుల పెదబాబు, బస్వా ప్రసాద్, జగదీష్ నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మేజిస్ట్రేట్‌గా గోపీనాథ్ బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టు మేజిస్ట్రేట్‌గా ఎల్.గోపీనాథ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ మేజిస్ట్రేట్‌గా పనిచేసిన కాటం భాను అనంతపురం జిల్లా కల్యాణ దుర్గం కోర్టుకు బదిలీ అయ్యారు. స్థానిక కోర్టు నూతన మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు చేపట్టిన గోపీనాథ్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, న్యాయవాదులు అభినందించారు. అలాగే ప్రత్తిపాడు నూతన ఫైర్ అధికారిగా ఎండీ అలీబేగ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మూడేళ్లుగా ఖాళీగా ఉన్న ఫైర్ అధికారి పోస్టులో అలీబేగ్ కొవ్వూరు నుంచి పదోన్నతిపై ఇక్కడ వచ్చారు.

బాల్య వివాహాల నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ప్రత్తిపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్మూలనలో అధికారులు, తల్లిదండ్రులు, నాయకులు భాగస్వాములు కావాలని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్, ఎంఈవో వి.రాజబాబు, సీడీపీవో టీడీఆర్ పద్మావతిలు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కిశోర్ వికాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో వారు ప్రసంగించారు. కిశోర్ బాలికల్లో వచ్చే మార్పులపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వరలక్ష్మి, టి.మంగారత్నం, పి.చక్రవేణిలు తెలిపారు. సమావేశంలో ఏపీవో కుమార స్వామి, ఏపీఎం వై. వెంకట్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సుంకర సోమరాజు, కూటమి నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, పినిశెట్టి ప్రకాష్, సేంద్రపు భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందనలు

ప్రత్తిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మండలవ్యాప్తంగా అత్యధిక మార్కులు 578 సాధించిన ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థి కొండి మని లోకేష్‌ను శుక్రవారం కలెక్టర్ షన్‌మోహన్ అభినందించి రూ.10వేలు నగదు, డాక్టర్ బీవీ పట్టాభిరామ్ రాసిన పుస్తకం అందజేశారు. విద్యార్థి తల్లిదండ్రులను కూడా కలెక్టర్ సన్మానించి అభినందించారు. అలాగే ప్రత్తిపాడు హైస్కూల్‌హెచ్‌ఎం టీవీఎస్ఎన్ రెడ్డి కూడా విద్యార్థిని అభినందించారు.